సాక్షి ఖమ్మం

సోమవారం, 11, ఆగస్టు, 2025



ఆల్బెండజోల్‌తో 'నులి'పేద్దాం

చిన్నారుల్లో రక్తహీనత సమస్యకు కారణమైన నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. 8లో



ఇక కోల్ పర్మిట్లకు అనుమతి

సత్తుపల్లిలో బొగ్గు లోడింగ్ సమస్య పరిష్కారానికి అడుగులు పడేలా లారీ యజమానుల యూనియన్ దిద్దుబాటు చర్యలకు దిగుతోంది. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 31° / 23°

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడా ఓ మోస్తరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఉత్సాహంగా టీటీ ఎంపికలు



ఎంపికలను ప్రారంభిస్తున్న సునీల్‌రెడ్డి తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్ : ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ ఎంపికలకు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల నుంచి 120 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. ప్రారంభ కార్యక్రమంలో డీవైఎస్ఓ టి.సునీల్ రెడ్డి మాట్లాడుతూ టేబుల్ టెన్నిస్ బోర్డులకు ప్రత్యేక హాల్ నిర్మిస్తున్నామని, ప్రతీ క్రీడాకారుడు సద్వినియోగం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు వెళ్లేలా రాణించాలని ఆకాంక్షించారు. టీటీ అసోసియేషన్ అధ్యక్షుడు బాలసాని విజయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు తమ సంఘం ఆధ్వర్యాన పది రోజుల పాటు శిక్షణ ఇచ్చి రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు జోజిచాకో, షేక్ ముజాఫర్, పరిటాల చలపతి, రెడ్డి సాయి, శివ, రామారావు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

ఖమ్మం రాపర్తినగర్ : ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యాన మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ఐటీఐ సెంటర్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారిణి ఎస్.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో హోమియో కేర్‌లో 34 పోస్టులకు ఇంటర్వ్యూలు ఉంటాయని, హాజరయ్యే వారికి 18 – 30 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలని పేర్కొన్నారు. హోమియో కేర్‌లో 30 పోస్టులకు నర్సింగ్, సూపర్‌వైజర్ పోస్టులకు బీఎస్సీ నర్సింగ్, బయోమెడికల్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు బీటెక్ బయోమెడికల్ సబ్జెక్టులో ఉత్తీర్ణులై ఉండాలని వివరించారు.

జిల్లాలో నాణ్యమైన విద్యుత్ సరఫరా

ఎస్ఈ శ్రీనివాసాచారి వెల్లడి



నూతన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎస్ఈ తదితరులు

ఎర్రుపాలెం: జిల్లావ్యాప్తంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని ఆ శాఖ ఎస్ఈ శ్రీనివాసాచారి తెలిపారు. మండలంలోని మామునూరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఐదు మెగావాట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గృహ, వ్యవసాయ వినియోగదారులకు అవసరమైన మేరకు నాణ్యత గల విద్యుత్ అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వైరా డీఈ బండి శ్రీనివాసరావు, మధిర ఏడీఈ అనురాధ, డీఈ భద్రు, ఏఈలు గణేష్, బోజ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామివారి మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. పవిత్రోత్సవాల సందర్భంగా నిలిపిన నిత్యకల్యాణాలను పునః ప్రారంభించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం పల్లకీసేవగా చిత్రకూట మండపానికి తీసుకొచ్చారు. ఆ తర్వాత అర్చకులు స్వామివార్లకు విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పారదర్శకతే లక్ష్యం



జిల్లాలో పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

- దశల వారీగా పరిశీలన.. ఫొటోల అప్‌లోడ్
- నిర్మాణం సక్రమంగా ఉంటేనే నగదు జమ
- మొదటి దశలో 16,153 మందికి లబ్ధి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో వేల మంది పేదల సొంతింటి కల నెరవేర్చే ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేసేలా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోంది. అర్హులను గుర్తించడం నుంచి గృహప్రవేశం వరకు అధికారుల కనుసన్నల్లోనే పనులు జరిగేలా ప్రణాళికాయుతంగా వ్యవహరిస్తోంది. ఈ క్రమంలో పునాది దశ నుంచి రూఫ్, స్లాబ్, ఇంటి నిర్మాణం.. ఇలా అన్ని దశల్లోనూ వివిధ స్థాయి అధికారులు పరిశీలిస్తూ నిర్మాణ ఫొటోలను ఎప్పటికప్పుడు ఇందిరమ్మ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితేనే లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ అవుతుంది. జిల్లాలో మొదటి దశలో 16,153 ఇళ్లు మంజూరు కాగా.. నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. రెండు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. అయితే కొన్నిచోట్ల ఫొటోల అప్‌లోడ్‌లో సాంకేతిక సమస్యలు ఎదురవడం, ఇతర కారణాలతో లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ కావడంలో జాప్యం జరుగుతోంది. వీటిని కూడా అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు.

సాంకేతిక చిక్కుముడులు..

ఇటీవల కొందరి ఖాతాల్లో డబ్బు జమ కావడం లేదనే చర్చ సాగుతోంది. చిన్న చిన్న సాంకేతిక సమస్యలతో ఈ ఇబ్బందులు వచ్చినట్లు తెలుస్తోంది. బేస్‌మెంట్ లెవెల్ పూర్తయ్యాక రూ.లక్ష, గోడల నిర్మాణం పూర్తయ్యాక రూ.లక్ష, స్లాబ్ పూర్తయ్యాక రూ.2లక్షలు, నిర్మాణం పూర్తయ్యాక రూ.లక్ష బ్యాంక్ ఖాతాలో జమవుతాయి. కొన్ని ప్రాంతాల్లో కొంత సమయం వరకు యాప్ ఓపెన్ కావడం లేదు. కారేపల్లి మండలం సీతారాం తండా, సత్తుపల్లి మున్సిపాలిటీలోని 2, 15, 22 వార్డుల్లో, కామేపల్లి మండలం బర్లగూడెంలో కొన్ని సమస్యలు ఎదురయ్యాయి. ఇంకొన్నిచోట్ల ఆధార్ లింక్ కాకపోవడం, పేరు, అకౌంట్ తప్పుగా ఉండడంతో కొందరి ఖాతాల్లో నగదు జమ కావడం లేదు. అయితే ఈ సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు.

జిల్లాలో 3,48,740 దరఖాస్తులు..

ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలన, మీసేవ, గ్రామసభల ద్వారా 3,48,740 దరఖాస్తులు వచ్చాయి. వీటిని ఎల్ –1, ఎల్ –2, ఎల్ –3గా విభజించారు. సొంత స్థలం ఉండి ఇల్లు లేకుండా గుడిసె, రేకుల షెడ్, టైల్స్ వేసిన, అద్దె ఇళ్లలో ఉండేవారిని ఎల్ –1(లిస్ట్)గా గుర్తించారు. గుడిసె, రేకులషెడ్, టైల్స్ వేసిన, అద్దె ఇళ్లలో ఉంటూ స్థలం లేనివారిని ఎల్ –2గా, ఇల్లు ఉండి.. తల్లిదండ్రుల నుంచి విడిపోయి మరో ఇల్లు కావాలని దరఖాస్తు చేసుకున్న వారిని ఎల్ – 3 కేటగిరీగా నిర్ణయించారు. ఈ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాక ఎల్ –1లో 73,472, ఎల్ –2లో 56,549, ఎల్ –3లో 2,18,719 దరఖాస్తులను విభజించారు. వీటిలో తొలుత 16,153 ఇళ్లు మంజూరు చేశారు.

నిర్ణీత స్థలంలోనే..

ఇల్లు మంజూరైన లబ్ధిదారుడు తన స్థలంలో ముగ్గు పోసుకుంటే పంచాయతీ సెక్రటరీ ఆ స్థలాన్ని ఫొటో తీసి.. ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. అకౌంట్ నంబర్, స్థలం వారిదా కాదా అని చెక్ చేస్తారు. ఆ తర్వాత నిర్మాణ పనులు ప్రారంభిస్తారు. ఒకసారి ఫొటో తీస్తే దాన్ని మార్చే అవకాశం ఉండదు. 400 చదరపు అడుగులు.. అంటే 60 గజాలకు తగ్గకుండా స్థలం ఉండాలి. 45 గజాల్లో నిర్మాణం చేపట్టాలి. నిబంధనల ప్రకారం నిర్మిస్తున్నారా లేదా అనేది పంచాయతీ సెక్రటరీ నిర్ధారిస్తారు.

అధికారుల పర్యవేక్షణ ఇలా..

ఇంటి పునాది నిర్మించాక గ్రామ కార్యదర్శి మళ్లీ లబ్ధిదారుడిని స్థలం వద్ద నిలబెట్టి సైడ్, టాప్, ఫ్రంట్ యాంగిల్లలో ఫొటో తీసి ఇందిరమ్మ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. దాన్ని ఏఈ పరిశీలించి అప్రూవ్ చేయాలి. 400 నుంచి 600 చదరపు అడుగుల లోపు స్థలం ఉందా లేదా.. బ్యాంక్ అకౌంట్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ సక్రమంగా ఉన్నాయా అని పరిశీలిస్తారు. ఎంత స్థలంలో నిర్మిస్తున్నారనే కొలతలతో పాటు మేస్త్రీ ఫోన్ నంబర్, పేరు రాసుకుని యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఆ తర్వాత డీఈ లాగిన్‌లోకి వస్తుంది. ఆయన బేస్‌మెంట్ లెవెల్, స్లాబ్, ఇల్లు పూర్తయ్యాక ఫొటోలు చూసి ఏమైనా అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకుని అప్రూవ్ చేస్తారు. అక్కడి నుంచి పీడీ లాగిన్‌కు వస్తుంది. అక్కడ సూపర్ చెక్ చేశాక కలెక్టర్ లాగిన్‌కు వెళ్తుంది. కలెక్టర్ అప్రూవ్ చేశాక ఎండీ లాగిన్‌కు వెళితే.. అక్కడి సెక్షన్ అధికారులు సీజీజీ (సెంట్రల్ ఫర్ గుడ్ గవర్నెన్స్) ఏఐ ద్వారా ప్లేస్‌మెంట్ సరిగా ఉందా.. నిబంధనల ప్రకారం నిర్మాణం ఉందా లేదా అనే వివరాలు పరిశీలిస్తారు. ఇలా అన్ని దశల్లోనూ అధికారుల పర్యవేక్షణ ఉంటుంది.

జిల్లాలో మంజూరైన ఇళ్లు	పైలట్ ప్రాజెక్టు గ్రామాల్లో మంజూరైనవి	ఇతర గ్రామాల్లో మంజూరైనవి	ముగ్గు పోసినవి
16,153	903	15,250	12,094

బేస్‌మెంట్ లెవెల్ వరకు వచ్చిన ఇళ్లు	రూఫ్ లెవెల్ వరకు పూర్తయినవి	స్లాబ్ వేసినవి	నిర్మాణం పూర్తయిన ఇళ్లు
7,398	1,019	397	02

ప్రతి ఎకరాకూ సాగునీరు



జవహర్ లిఫ్ట్ పనులకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి, పక్కన మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీహరి తదితరులు

- రూ.630 కోట్లతో 33 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, పొంగులేటి, వాకిటితో కలిసి జవహర్ లిఫ్ట్ పనులకు శంకుస్థాపన

మధిర: జిల్లాలోని ప్రతీ ఎకరానికి కృష్ణ, గోదావరి జలాలు అందేలా కృషి చేస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మధిర, ఎర్రుపాలెం మండలాలకు సాగునీరు అందించేందుకు రూ.630 కోట్లతో వంగవీడు సమీపంలో వైరా నదిపై చేపట్టిన జవహర్ ఎత్తిపోతల పథకం పనులకు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో భట్టి మాట్లాడుతూ.. నాగార్జున సాగర్ మూడో జోన్‌లో ఉన్న ఆయకట్టుకు రెండో జోన్ నుంచి సాగునీరు అందించాలని ఈ ప్రాంత ప్రజలు పలుమార్లు విజ్ఞప్తి చేశారని తెలిపారు. మధిర ప్రాంతంలో కట్టలేరు, వైరా, మున్నేరు నదులు ప్రవహిస్తున్నా సాగు నీరందడం లేదన్నారు. జవహర్ ఎత్తిపోతల పథకానికి 2012లో మంజూరు ప్రతిపాదనలు సమర్పించామని, గత పాలకులు పదేళ్లలో ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక సర్వే చేసి, నిధులు మంజూరు చేశామన్నారు. పాలేరు నుంచి సత్తుపల్లి వరకు నాగార్జున సాగర్ ఎడమ కాలువ ద్వారానే పంటలు పండుతున్నాయని చెప్పారు.

గేమ్ చేంజర్‌గా ఎత్తిపోతల పథకం..

జవహర్ ఎత్తిపోతల పథకం మధిర ప్రాంతానికి గేమ్ చేంజర్‌గా ఉంటుందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఏడాది లోపు పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జవహర్ ఎత్తిపోతల పథకం ద్వారా 33వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని, వైరా నదిలో 120 రోజుల్లో 4 టీఎంసీలు ఎత్తిపోసేలా రూపకల్పన చేశామని తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి 190 ఎకరాల భూ సేకరణ చేయాల్సి ఉంటుందని, ఇందుకోసం రూ.45 కోట్లు కేటాయించామని చెప్పారు. మధిర మండలంలో 13 వేల ఎకరాలు, ఎర్రుపాలెం మండలంలో 19 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని అన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు పుష్కలంగా గోదావరి నది జలాలు తీసుకొస్తామని ప్రకటించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. దిండి, సీతారామ, పాలమూరు, దేవాదుల ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. రూ.1,200 కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణం చేపట్టామని, వంగవీడుకు డబుల్ రోడ్డు వేస్తామని చెప్పారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో గత పాలకులు పేదలను మోసం చేశారని, తమ ప్రభుత్వం వచ్చాక ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. దేశంలో మరే రాష్ట్రంలోనూ లేని విధంగా సన్న ధాన్యం పండించిన రైతులకు గిట్టుబాటు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నామని చెప్పారు. రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. జోన్ 3లో ఉన్న బ్రాంచ్ కెనాల్‌పై మధిర, ఎర్రుపాలెంలో 33 వేల ఎకరాల ఆయకట్టు ఉన్నా నీరందక రైతులు ఇబ్బంది పడ్డారని తెలిపారు. జవహర్ ఎత్తిపోతల పథకంతో ఆంధ్రాతో సంబంధం లేకుండా జోన్ 3 ఆయకట్టును జోన్ 2 పరిధిలోకి తీసుకొస్తామని చెప్పారు. గోదావరి నీటిని పాలేరు తీసుకొచ్చి కృష్ణానది పరీవాహక ప్రాంతంలో ఉన్న 33 వేల ఎకరాలు రెండు పంటలు సాగయ్యేలా ఈ పథకం ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, మట్టా రాగమయి, సీపీ సునీల్ దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ సీఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీఎఫ్ఐ ప్రధాన కార్యదర్శిగా చావా రవి

కేంద్ర కమిటీ సభ్యులుగా దుర్గాభవాని



చావా రవి



దుర్గాభవాని

ఖమ్మం సహకారనగర్ : దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లోని సుమారు ఏడు లక్షల మంది ఉపాధ్యాయులకు ప్రాతినిధ్యం వహించే స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీఎఫ్ఐ) నూతన ప్రధాన కార్యదర్శిగా టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి, కేంద్ర కమిటీ సభ్యులుగా సీహెచ్.దుర్గాభవాని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోల్‌కతా నగరంలో జరుగుతున్న ఎస్‌టీఎఫ్ఐ 9వ రజతోత్సవ మహాసభలో వీరిరువురు ఎన్నిక కావడం హర్షణీయమని పేర్కొన్నారు. చావా రవి 35 సంవత్సరాలుగా ఉపాధ్యాయుల సంక్షేమం, ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, మండల స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షులుగా పనిచేసి, ప్రస్తుతం అఖిల భారత ఉపాధ్యాయ ఉద్యమానికి నాయకత్వం వహించడం జిల్లాకు గర్వకారణమని తెలిపారు. దుర్గాభవాని మహిళా ఉపాధ్యాయులను చైతన్యపరుస్తూ, ఆదర్శవంతంగా పనిచేసి బాలికల విద్యావ్యాప్తికి కృషిచేస్తున్నారని పేర్కొన్నారు. వీరి ఎన్నిక పట్ల యూటీఎఫ్ నాయకులు జి.వి.నాగమల్లేశ్వరరావు, బుర్రి వెంకన్న, షమి, వల్లంకొండ రాంబాబు హర్షం వ్యక్తం చేశారు.

ముగిసిన నాటిక పోటీలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నెలనెలా వెన్నెల నిర్వాహకులు

ఖమ్మంగాంధీచౌక్: తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు ఆదివారం ముగిశాయి. ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో జరిగిన ఈ పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన కళాసంస్థలు తొమ్మిది నాటికలు ప్రదర్శించాయి. సమాజ చైతన్యం, మూఢనమ్మకాలు, కొత్తపోకడలు, పాశ్చాత్య సంస్కృతి వంటి అంశాలపై ప్రదర్శించిన నాటికలు ప్రేక్షకులను ఆలోచింపజేశాయి. ఆదివారం హైదరాబాద్ గోవాడ క్రియేషన్స్ వారు 'అమ్మ చెక్కిన బొమ్మ' నాటికను ప్రదర్శించారు. జ్యోతిరాజ్ బీశెట్టి రచించిన ఈ నాటికకు డాక్టర్ వెంకట్ గోవాడ దర్శకత్వం వహించారు. ఇక విశాఖపట్టణానికి చెందిన చైతన్య కళాస్రవంతి వారు (అ)సత్యం నాటికను ప్రదర్శించారు. చివరి రోజు నెల నెలా వెన్నెల నిర్వాహకులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ గాంధీ ఆస్పత్రి వైద్యులు సీహెచ్.ఎస్. రాజకుమారి హాజరయ్యారు. కార్యక్రమంలో స్థానిక విద్యావేత్తలు వంగా సాంబశివరావు, చైతన్య విద్యాసంస్థల అధినేత మల్లెంపాటి శ్రీధర్, హార్వెస్ట్ విద్యాసంస్థల అధినేత రవిమారుత్, నెల నెలా వెన్నెల నిర్వాహకులు ఎ.సుబ్రహ్మణ్యకుమార్, డాక్టర్ నాగబత్తిని రవి, జగన్మోహన్‌రావు, కురువెళ్ల ప్రవీణ్, వేముల సదానందం, నామా లక్ష్మీనారాయణ, వేల్పుల విజేత, మొగిలి శ్రీనివాసరెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సేవలకు ఇక సెలవ్..!

త్వరలో నాగులవంచ రైల్వేస్టేషన్ మూసివేత



మూసివేయనున్న నాగులవంచ రైల్వేస్టేషన్

చింతకాని : మండల పరిధిలోని నాగులవంచ రైల్వేస్టేషన్‌ను త్వరలో మూసివేయనున్నారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ బి.సునీత ఇటీవల ఉత్తర్వులు జారీ చేయగా, ఆదివారం వెలుగులోకి వచ్చింది. సుమారు 77 సంవత్సరాలుగా ఎంతో మంది ప్రయాణికులకు సేవలందించిన ఈ రైల్వేస్టేషన్‌కు ప్రయాణికుల నుంచి ఆదరణ తగ్గడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సర్క్యులర్‌లో పేర్కొన్నారు. ఈ రైల్వేస్టేషన్‌లో ఇప్పటికే కాంట్రాక్ట్ పొందిన ప్రైవేట్ వ్యక్తి టికెట్లు విక్రయిస్తుండగా.. ఇటీవల అతడు కూడా టికెట్లు ఇవ్వడం లేదు. కాగా, ఈ రైల్వేస్టేషన్‌ను మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించడంతో నాగులవంచ రైల్వేకాలనీ, నాగులవంచ, పాతర్లపాడు, సీతంపేట, చిన్నమండవ, రామాపురం, లక్ష్మీపురం, గోవిందాపురం (ఎల్) గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ రైల్వేస్టేషన్ అభివృద్ధికి అప్పటి ఎంపీ నామా నాగేశ్వరరావుకు పాతర్లపాడు గ్రామస్తులు పలుమార్లు వినతిపత్రాలు అందజేశారు. రైల్వే స్టేషన్‌ను మరింతగా అభివృద్ధి చేస్తారని ఊహించిన చుట్టుపక్కల గ్రామాల ప్రజలు.. అసలే మూసివేస్తున్నట్లు సర్క్యులర్ జారీ చేయడంతో విస్మయం వ్యక్తం చేశారు. మూడో లైన్ ఏర్పాటుతో రైల్వేస్టేషన్‌లో కొత్తగా బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేశారు. అలాగే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని కూడా చేపట్టారు. మూసివేసే స్టేషన్‌కు ఇవన్నీ ఎందుకు చేసినట్టనేది ప్రశ్నార్థకంగా మారింది. కాగా, నాగులవంచ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు సేవలు కొనసాగించేలా రైల్వే ఉన్నతాధికారులను కలుస్తామని పాతర్లపాడు గ్రామస్తులు తెలిపారు. రైల్వే శాఖ అధికారులు తమ నిర్ణయంపై పునరాలోచన చేయాలని అంటున్నారు.

'సరోగసీ'పై నిఘా!

- ఫెర్టిలిటీ సెంటర్ల నియంత్రణకు సర్కార్ చర్యలు
- జిల్లాలో తనిఖీలు చేపట్టనున్న రాష్ట్ర స్థాయి అధికారులు
- 'సృష్టి' ఘటన నేపథ్యంలో ప్రభుత్వం సీరియస్
- జిల్లా స్థాయిలోనూ ముమ్మరంగా తనిఖీలు



మార్వెల్ ఆస్పత్రి యాజమాన్యానికి నోటీసు ఇస్తున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి(ఫైల్)

ఖమ్మంవైద్యవిభాగం: సరోగసీ ముసుగులో హైదరాబాద్‌లోని సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ చేసిన నిర్వాకాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ మేరకు హైదరాబాద్ సహా వివిధ జిల్లాల్లో టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ల తీరును తెలుసుకునేందుకు ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటుచేసింది. ఈ క్రమంలో జిల్లాలోని టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్లను త్వరలో తనిఖీ చేయనుండగా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కేంద్రాల నిర్వాహకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. జిల్లాలో ప్రస్తుతం ఏడు టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్లకు అనుమతి ఉండగా వాటిలో రెండు సెంటర్లు సరోగసీకి అనుమతి తీసుకున్నారు. ఇంకా పర్మిషన్ లేకుండా అనేక సెంటర్లు పుట్టుకొచ్చాయి.

త్వరలోనే ఉన్నతాధికారుల పరిశీలన..

హైదరాబాద్ తర్వాత మెడికల్ హబ్‌గా వరంగల్, కరీంనగర్, ఖమ్మం నగరాలకు పేరుంది. కాగా ఖమ్మంలో తక్కువ సమయంలో ఎక్కువ సంతాన సాఫల్య కేంద్రాలు వెలిశాయి. జిల్లాకు అనుకుని ఉన్న భద్రాద్రి, సూర్యాపేట, మహబూబాబాద్, ఏపీలోని కృష్ణా జిల్లాల నుంచి వైద్య సేవల కోసం ఎక్కువగా ఖమ్మం వస్తుంటారు. దీనికి తోడు ఆర్ఎంపీలు కమీషన్ల ప్రాతిపదికన పేషెంట్లను తీసుకొస్తుంటారు. ఇదే అదనుగా ఇటీవల సంతాన సాఫల్య కేంద్రాలు కూడా పుట్టుకొచ్చాయి. పిల్లలు లేని దంపతులకు వల వేసి ఆయా సెంటర్లకు తీసుకొస్తుండగా తమ వద్ద చికిత్స తీసుకుంటే 100 శాతం పిల్లలు పుట్టడం గ్యారంటీ అంటూ సెంటర్ల నిర్వాహకులు రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయా సెంటర్ల అక్రమాలకు చెక్ పెట్టేందుకు త్వరలోనే తనిఖీలకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

జిలా స్థాయిలో తనిఖీలు..

హైదరాబాద్ ఘటన కలకలంతో కలెక్టర్ వైద్యారోగ్య శాఖ అధికారులను అప్రమత్తం చేశారు. అనుమతి లేని టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్లు, నిబంధనలు పాటించని ఆస్పత్రుల్లో తనిఖీలు చేయాలని ఆదేశించారు. దీంతో ఈనెల 1న తనిఖీలు ప్రారంభించారు. వైరా రోడ్‌లోని రోహిత్ టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ ను తనిఖీ చేశారు. అలాగే వైరారోడ్‌లోని మార్వెల్స్ హాస్పిటల్‌లో గతంలో సుమారు 168మందికి చికిత్స అందించినట్లు నకిలీ బిల్లులు ఇవ్వగా.. వారు సీఎంఆర్ఎఫ్ బిల్లుల కోసం సమర్పించినట్లు తేలడంతో ఆస్పత్రిని సీజ్ చేశారు. మయూరిసెంటర్‌లోని బ్రీత్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల ఓ మహిళ మృతి చెందడానికి డాక్టర్, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని కలెక్టర్ దృష్టికి వెళ్లగా ఆయన ఆదేశాల మేరకు డీఎంహెచ్‌ఓ, సిబ్బంది వెళ్లి విచారించారు. మహిళ మృతికి వారి నిర్లక్ష్యమే కారణమని గుర్తించి ఆస్పత్రిని సీజ్ చేశారు. అయితే జిల్లాస్థాయిలో చేపట్టిన తని ఖీలు సాదారణమైనవే కాగా హైదరాబాద్ నుంచి వచ్చే బృందాల తనిఖీలతో ఎవరి బాగోతాలు బయటపడతాయో త్వరలో తేలనుంది.

క్లుప్తంగా

అంతర్జాతీయ సదస్సుకు న్యాయవాది ఎంపిక


రామకృష్ణను సన్మానిస్తున్న అధికారులు

కల్లూరు: ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ అంతర్జాతీయ సదస్సుకు కల్లూరు పట్టణం అంబేద్కర్ నగర్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది ఉబ్బన రామకృష్ణ ఎంపికయ్యారు. ఆగస్టు 16న వియత్నం రాజధాని హనోయ్‌లో జరుగనున్న సదస్సులో పాల్గొననున్నారు. ఆదివారం ఖమ్మం ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన సేవలను అధికారులు కొనియాడి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ టీఎస్ ఏరియా3 డీఆర్‌ఎం కె.శ్రీనివాసరావు, ఖమ్మం డివిజన్ మేనేజర్ ఎ.సంతోష్‌రెడ్డి, యూనిట్ మేనేజర్ కోటా నరసింహారావులు రామకృష్ణను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కిన్నెరసానిలో సండే సందడి


బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి సందర్శకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్యామ్, జలాశయం, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు. 579 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.32,845 ఆదాయం లభించింది. 360 మంది బోటు షికారు చేయగా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.18,640 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) సత్యనారాయణ మిత్రులు, అధికారులతో కలిసి కిన్నెరసానిని సందర్శించారు. జలాశయంలో బోటు షికారు చేశారు.

వేతనాలు పెంచాలి

సింగరేణి(కొత్తగూడెం): కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపు కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్‌సీసీడబ్ల్యుయూ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.వెంకన్న పిలుపునిచ్చారు. ఆదివారం కొత్తగూడెంలోని జిల్లా కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన యూనియన్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలోని వివిధ విభాగాల్లో సుమారు 32 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో వేతనం రూపాయి కూడా పెంచలేదని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కార్మికులకు వేతనాలు పెంచకపోవడంతో పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు గౌని నాగేశ్వరరావు, ఎన్.సంజీవ్, రాసుద్దీన్, రాజేశం, బి.అశోక్, మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి విశేషపూజలు


పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ బి.నాగేశ్వరరావు, వేదపండితులు పద్మనాభ శర్మ, అర్చకుడు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

వైరా: ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఆంధ్ర నుంచి తరలిస్తున్న ఇసుక లారీని వైరా పోలీసులు ఆదివారం ఉదయం పట్టుకున్నారు. ఎస్ఐ పి.రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా తల్లాడ నుంచి వైరా వైపు వస్తున్న లారీని ఆపి పరిశీలించగా ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గమనించారు. దీంతో వాహనాన్ని స్వాధీనం చేసుకుని వాహన డ్రైవర్ బాలకృష్ణ, యజమాని వెంకటేశ్వరరావు, రవాణాకు సహకరిస్తున్న వైరాకు చెందిన బాణోత్ కృష్ణలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.18,052

ఆల్బెండజోల్‌తో నులిపేద్దాం..

నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లల కోసం సోమవారం జిల్లా వ్యాప్తంగా నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నులిపురుగుల మూలంగా చిన్నారుల్లో రక్తహీనత ఏర్పడి వివిధ రకాల వ్యాధుల గురవుతున్న నేపథ్యాన ప్రభుత్వం పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించే కార్యక్రమం చేపట్టింది. ఇందుకు అంగన్‌వాడీ, విద్యాశాఖ సమన్వయంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన అన్ని ఏర్పాట్లు చేసింది. అంగన్‌వాడీ సెంటర్లు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పిల్లలకు మాత్రలు మింగించేలా సిబ్బందికి సైతం శిక్షణ ఇచ్చారు. అలాగే అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఇప్పటికే అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీ, అర్బన్‌హెల్త్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. – ఖమ్మంవైద్యవిభాగం

నేడు నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

- 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు మాత్రల పంపిణీ
- జిల్లావ్యాప్తంగా 3,11,317 మంది పిల్లల గుర్తింపు
- అందుబాటులో 3.30 లక్షల మాత్రలు
- మిస్ అయిన వారికి 18న మాప్ అప్ రౌండ్

నూరు శాతం సక్సెస్‌కు..

జిల్లా వ్యాప్తంగా 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లల కోసం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన ముందస్తుగా ఇంటింటి సర్వే నిర్వహించగా మొత్తం 3,11,317 మంది ఉన్నట్లు గుర్తించారు. వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు మింగించేలా 3.30 లక్షల మాత్రలు సిద్ధం చేసి ఇప్పటికే అన్ని కేంద్రాలకు పంపిణీ చేశారు. నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నూరు శాతం అమలయ్యేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి అంగన్‌వాడీలు 1,840 మంది, మెడికల్ అండ్ హెల్త్ వర్కర్లు 1,260మంది, ఆశాలు 1,339. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 1,750 మంది సిబ్బందిని నియమించింది. ఒకవేళ నేడు (సోమవారం) మిస్ అయిన పిల్లలకు ఈ నెల 18న మాప్‌అప్ రౌండ్ నిర్వహించనున్నారు.



మాత్రలు మింగించే విధానం, జాగ్రత్తలు..

- 1 నుంచి 19 ఏళ్ల లోపు బాలబాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయనుండగా.. 1 నుంచి 2 ఏళ్ల చిన్నారులకు అర(1/2) మాత్రను రెండు చెంచాలతో పొడి(క్రష్) చేసి నీటితో మింగించాలి.
- 2 నుంచి 3 ఏళ్ల చిన్నారులకు పూర్తి(ఫుల్) మాత్రను రెండు చెంచాలతో పొడి(క్రష్) చేసి నీటితో మింగించాలి.
- 3 నుంచి 19 ఏళ్ల వరకు ఉన్నవారికి ఒక మాత్ర నమిలి మింగించాలి.
- అనారోగ్య సమస్యలు, ఇతర చికిత్సలు తీసుకున్న పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లో మాత్రలు మింగించొద్దని, పిల్లలకు మధ్యాహ్న భోజనం అయిన అరగంట తర్వాతనే మాత్రలు మింగించాలని ఆరోగ్య శాఖ అధికారులు సూచిస్తున్నారు.

వివిధ కేంద్రాల్లో ఉన్న చిన్నారుల వివరాలు..

అంగన్‌వాడీల్లో (1 నుంచి 5 ఏళ్లలోపు చిన్నారులు)	74,641
ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల పిల్లలు	95,276
ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు	6,040
ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాల విద్యార్థులు	1,35,360

ఏర్పాట్లు పూర్తి చేశాం..



ఆల్బెండజోల్ మాత్రలు మింగించే కార్యక్రమం నూరు శాతం పూర్తి చేసేలా ఏర్పాట్లు పూర్తి చేశాం. 1 నుంచి 19 ఏళ్ల పిల్లలకు తప్పకుండా మాత్రలు మింగించాలి. పిల్లలు గోళ్లు కత్తిరించుకోకపోవడం, చేతులు కడకుండా భోజనం చేయటం ద్వారా పేగుల్లోకి నట్టలు చేరి ఆకలి మందగించడంతో పాటు రక్తహీనత ఏర్పడి అనారోగ్యపాలవుతారు. అలా జరగకుండా పిల్లలకు మాత్రలు వేయించి వారి కడుపులోని నులిపురుగులను అంతం చేయొచ్చు. సోమవారం మిస్ అయిన పిల్లలకు ఈ నెల 18 ప్రత్యేక మాప్ అప్ రౌండ్ ద్వారా మళ్లీ మాత్రలు అందిస్తాం.
– డాక్టర్ చందూనాయక్, డిప్యూటీ డీఎంహెచ్ఓ

నూతన విద్యాపాలసీ దేశానికే ప్రమాదం


సెమినార్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ దేవరాజు

ఖమ్మంమయూరిసెంటర్: నూతన విద్యావిధానం దేశానికి అత్యంత ప్రమాదమని, బీజేపీ అధికారంలోకి వచ్చాక కోవిడ్ ముందు నుంచి ఇప్పటికీ 1,800కు పైగా అంశాలను మార్చిందని జీవశాస్త్ర ప్రొఫెసర్, కవి, రచయిత, కవిరాజు త్రిపురనేని రామస్వామి తొలి జాతీయ అవార్డు గ్రహీత దేవరాజు మహారాజు అన్నారు. మానవశక్తి స్థానంలో దైవశక్తిని చొప్పించి అజ్ఞానం వైపు విద్యావిధానాన్ని తీసుకెళ్లే ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నారు. బోడేపూడి విజ్ఞాన కేంద్రం 20వ వార్షికోత్సవం సందర్భంగా బోడేపూడి స్మారకోపన్యాసం సావనీర్ ఆవిష్కరణ సందర్భంగా సైన్స్,చరిత్ర పాఠ్యాంశాల మార్పులపై స్థానిక మంచికంటి హాల్‌లో బీవీకే ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం అధ్యక్షతన ఆదివారం సెమినార్ నిర్వహించగా ఆయన మాట్లాడారు. జాతీయ విద్యావిధానాన్ని మార్చి అసంబద్ధమైన, అవాస్తవాలతో కూడిన న్యూ ఎడ్యుకేషన్ పాలసీ–2020ని తీసుకొచ్చారని, జీవపరిణామక్రమ సిద్ధాంతాన్నే మార్చాలని చూడడం అవివేకం అన్నారు. ఈ దేశాన్ని హిందూరాష్ట్రంగా మార్చాలని చూస్తున్నారని మండిపడ్డారు.

50 శాతం పన్నులపై స్పందించరేంటి..?

అమెరికా అధ్యక్షుడు ట్రంప్, మోదీ స్నేహితులు అయినప్పుడు మనదేశ ఉత్పత్తులపై అమెరికా 50 శాతం దిగుమతి సుంకాన్ని విధించినప్పుడు ప్రధాని ఎందుకు స్పందించడం లేదని తమ్మినేని వీరభద్రం అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చర్యల వల్ల ఇప్పుడు రైతులు సంక్షోభంలో పడ్డారన్నారు. పాకిస్తాన్‌పై 19%, కొన్నిదేశాలపై 10, 15 శాతం దిగుమతి సుంకాలు మాత్రమే వేసి ఇండియాపై పెద్దమొత్తం పన్ను వేశారని వివరించారు. భారతీయ వ్యవసాయరంగాన్ని నాశనం చేసేలా ట్రంప్ చేస్తున్న ఆగడాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీవీకే ట్రస్ట్ జనరల్ మేనేజర్ వై.శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ పోతినేని సుదర్శన్, ప్రధాన కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రూ. కోటికి పరువు నష్టం దావా

ఖమ్మం లీగల్ : తప్పుడు కేసులు పెట్టి తీవ్ర మనోవేదనతో పాటు డబ్బు, సంఘంలో తమ గౌరవ ప్రతిష్టలకు భంగం కలిగించిన ఎస్సై ఓంకార్‌యాదవ్, గ్రానైట్ వ్యాపారి ఓం నారాయణ ఖండేల్వాల్‌పై రూ.కోటికి ఖమ్మం కోర్టులో బాధితులు సివిల్, క్రిమినల్ పరువు నష్టం కేసులు దాఖలు చేశారు. వివరాలిలా.. 2006కు ముందు తిరుమలాయపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలోని 2.33 ఎకరాల భూమిని మద్దినేని శ్రావణ్‌కుమార్‌కు తన తాత రంగయ్య గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేశారు. ఆ తర్వాత శ్రావణ్ పేరుతో పట్టాదారు పాసు పుస్తకం ఇవ్వాలని తహసీల్దార్‌కు దరఖాస్తు చేవారు. అయితే.. ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ గ్రానైట్, మార్బుల్స్ వ్యాపారి ఓం నారాయణ ఖండేల్వాల్ సదరు భూమి కౌలుదారు కాంపాటి వెంకటేశ్వర్లుతో కుమ్మక్కై అక్రమ మార్గంలో కౌలుదారు పేరుతో పాసు పుస్తకం పొందారు. సదరు పాసు పుస్తకాన్ని రద్దు చేయాలని బాధితులు ఖమ్మం ఆర్డీఓ వద్ద అప్పీలు, కోర్టులో డిక్లరేషన్ దావా దాఖలు చేశారు. 2012లో తిరుమలాయపాలెం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందితో కలిసి రికార్డులు ట్యాంపరింగ్ చేసి పాసు పుస్తకం పొందిన ఘటనలో ఖండేల్వాల్, వెంకటేశ్వర్లుతోపాటు రెవెన్యూ సిబ్బందిపై క్రిమినల్ కేసు నమోదైంది. అనంతరం ఆర్డీఓ కోర్టు స్థానిక తహసీల్దార్ తీరును తప్పుబడుతూ వారిద్దరికి జారీ అయిన పాసు పుస్తకాలను రద్దు చేస్తూ తీర్పు చెప్పింది. ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు సైతం సదరు పాసు పుస్తకాలు రద్దు చేసి శ్రావణ్ కుమార్ పేరుపై భూమి నమోదు చేసి పాసు పుస్తకాలు జారీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పుపై అక్రమార్కులు జిల్లా కోర్టులో అప్పీలు చేయగా కింది కోర్టు తీర్పు సరైనదేనని పేర్కొంటూ డిస్మిస్ చేశారు. హైకోర్టులోనూ వారికి అదే పరిస్థితి ఎదురైంది. సుప్రీంకోర్టులోనూ వారి అప్పీలును కొట్టేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వారు అప్పటి తిరుమలాయపాలెం ఎస్సై ఓంకార్ యాదవ్‌తో కుమ్మక్కై శ్రావణ్‌కుమార్, అతడి తండ్రి వెంకటేశ్వర్లుపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. శ్రావణ్ ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లకుండా చేశారు. ప్రైవేటు ఉద్యోగాలు చేసుకోనివ్వకుండా మానసికంగా, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. చివరికి వారు నమోదు చేసిన క్రిమినల్ కేసును కూడా కోర్టు కొట్టేసింది. దాదాపు పదేళ్లకు పైగా శ్రావణ్ కుమార్, తన తండ్రి వెంకటేశ్వర్లును అన్ని విధాలా నష్టపరచడంతోపాటు సంఘంలో గౌరవ మర్యాదలకు భంగం కలిగించారని పేర్కొంటూ గ్రానైట్ వ్యాపారి ఓం నారాయణ ఖండేల్వాల్, ఎస్సై ఓంకార్ యాదవ్‌లపై రూ.కోటికి ఖమ్మం జిల్లా కోర్టులో సివిల్ డిఫమేషన్ కేసు దాఖలు చేశారు. అదేవిధంగా ఈ ఇద్దరిపై ఖమ్మం ప్రిన్సిపల్ జేఎఫ్‌సీఎం కోర్టులో క్రిమినల్ డిఫమేషన్ కేసు దాఖలు చేశారు. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు కిలారు లక్ష్మీనర్సింహారావు, గొల్లపూడి రామారావు వాదిస్తున్నారు.

బాల్య వివాహం అడ్డగింత..

నేలకొండపల్లి: తెల్లారితే వివాహం.. స్థానికుల ఫిర్యాదుతో బాల్య వివాహాన్ని సంబంధిత అధికారులు అడ్డుకున్నారు. కాగా, ఓ పేదోడి బిడ్డ వివాహం చేస్తుండగా జీర్ణించుకోలేని కొందరు అధికారులకు ఫిర్యాదు చేశారని స్థానికులు సోషల్ మీడియా వేదికగా వివాదానికి దిగారు. వివరాలిలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలంలోని ఓ గ్రామంలో మైనర్(16)కు అదే గ్రామానికి చెందిన యువకుడితో ఆదివారం వివాహం నిశ్చయించారు. శనివారం రాత్రి పెళ్లి పనులు పూర్తి చేసుకోగా.. ఇంతలో స్థానికులు కలెక్టర్‌కు బాల్య వివాహం చేస్తున్నారని ఫిర్యాదు అందడంతో ఐసీడీఎస్, బాలల సంరక్షణ అధికారులు అక్కడకు చేరుకుని వివాహాన్ని అడ్డుకున్నారు.దీంతో పెళ్లి కోసం అప్పులు చేసి వివాహం చేస్తుంటే అడ్డుపడుతున్నారని కుటుంబీకులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఆతర్వాత బాలికను జిల్లా కేంద్రానికి తరలిస్తుండగా.. వివాహం చేయబోమని లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వడంతో అధికారులు వెనుదిరిగారు. ఆదివారం ఈ విషయమై స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి తెలిపారు. ఇదిలా ఉండగా.. బాలిక తండ్రికి మద్దతుగా పేదోడి కూతురు పెళ్లి చేస్తుంటే ఓర్వలేక అడ్డుకున్నారంటూ సోషల్ మీడియా పోస్టులు పెట్టారు.

ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

కల్లూరు: ఓ కంపెనీ వార్షికోత్సవ వేడుకలో కులంపేరుతో దూషించి, అవమానించిన ముగ్గురు వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 7న మధ్యాహ్నం కల్లూరు స్వాగత్ రెస్టారెంట్‌లో బేయర్ ఆగ్రో పురుగుమందుల కంపెనీ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విందు ఏర్పాటు చేశారు. ఈ విందులో పాల్గొన్న కల్లూరు మండలం వాచ్యానాయక్ తండాకు చెందిన బానోత్ ప్రసాద్‌ను లింగాల గ్రామానికి చెందిన దేవరపల్లి వెంకటరావు, మట్టూరి రాజేష్, దేవరపల్లి అశోక్‌లు కులం పేరుతో దూషించి, అవమాన పరిచారు. దీంతో బాధితుడు ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఆ ముగ్గురుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి ఏసీపీ రఘు ఆధ్వర్యాన దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ హరిత పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

చింతకాని: మండల పరిధిలోని నాగులవంచ గ్రామానికి చెందిన జొన్నలగడ్డ శ్రీకాంత్ (32) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు కథనం ప్రకారం.. శ్రీకాంత్ ఈనెల 6న పొలంలో పురుగుమందును పిచికారీ చేసి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందతూ మృతి చెందాడు. మృతుడి సోదరుడు వంశీ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కూలిన స్తంభం.. తప్పిన ప్రమాదం

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమేనంటున్న గ్రామస్తులు


రావిచెట్టుతండాలో కూలిన విద్యుత్ స్తంభం

తిరుమలాయపాలెం: విద్యుత్ అధికారుల పర్యవేక్షణ లోపంతో నూతనంగా ఏర్పాటు చేసిన స్తంభం కూలిపోయింది. అప్పటివరకు అక్కడే ఆడుకున్న చిన్నారులు వర్షం వస్తుండగా ఇళ్లలోకి వెళ్లాక స్తంభం కూలడంతో పెను ప్రమాదం తప్పినట్టయింది. ఈ ఘటన మండలంలోని హైదర్‌సాయిపేట శివారు రావిచెట్టుతండాలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలతో ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలు తొలగింపునకు ఆయా గ్రామాల్లో విద్యుత్ కాంట్రాక్టర్‌తో స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో 15 రోజుల క్రితం రావిచెట్టుతండాలో విద్యుత్ స్తంభం వేశారు. ఆ సమయంలో ఐదు నుంచి ఆరు అడుగుల మేర లోతున గుంత తవ్వాల్సి ఉండగా బండ రావడంతో రెండడుగులు మాత్రమే తవ్వి స్తంభం వేశారు. విద్యుత్ అధికారుల పర్యవేక్షణలో స్తంభం ఏర్పాటు చేయాల్సి ఉండగా కాంట్రాక్టర్ ఇవేమీ పట్టించుకోకుండా రెండడుగుల గుంతలో తొమ్మిది మీటర్ల ఎత్తుగల స్తంభం ఏర్పాటు చేశారు. దీంతో ఆదివారం వర్షానికి స్తంభం కూలగా గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం


రోడ్డుపై బోల్తాపడిన లారీ

కొణిజర్ల: మొక్కల లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా కొట్టిన సంఘటన మండల పరిధిలోని పల్లిపాడు సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ఎస్ఐ సూరజ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ నుంచి ఏపీలోని రాజమండ్రికి మొక్కలు లోడుతో వెళ్తున్న లారీ పల్లిపాడు పెట్రోల్ బంక్ సమీపాన అదుపు తప్పి రోడ్డు మీద బోల్తా కొట్టింది. ఆ సమయంలో వాహనాలేవి రాకపోవడంతో పెను ప్రమాదం తప్పగా.. ఎవరూ గాయపడలేదు. పోలీసులు క్రేన్ సాయంతో లారీని పక్కకు తీయించి ట్రాఫిక్ పునరుద్ధరించారు.

ఇక కోల్ పర్మిట్లకు అనుమతి..


సత్తుపల్లి లారీ యూనియన్ కార్యాలయం వద్ద నిలిచిన లారీలు

- లోకల్, నాన్‌లోకల్ లోడింగ్‌పై చర్చ
- నేడు లారీ యూనియన్ సర్వసభ్య సమావేశం

సత్తుపల్లి: బొగ్గు లోడింగ్‌లపై జరుగుతున్న చర్చ పరిష్కారం దిశగా అడుగులు పడుతుంది. 'సాక్షి'లో వచ్చిన వరుస కథనాలతో లారీ యజమానుల యూనియన్ దిద్దుబాటు చర్యలకు దిగుతోంది. లోకల్, నాన్‌లోకల్ లోడింగ్‌లపై చర్చించి తగు నిర్ణయం తీసుకునేందుకు సోమవారం లారీ యూనియన్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు 'సాక్షి'కి తెలిపారు. లోకల్ సీరియల్‌తో పాటు నాన్‌లోకల్ సీరియల్‌లో కూడా స్థానిక లారీలకు లోడింగ్ ఇచ్చి అవసరమైతే బయట లారీలకు ఇచ్చే కిరాయికే వెళ్లేలా కార్యాచరణపై చర్చించేందుకు సీనియర్ లారీ యజమానులు సిద్ధమవుతున్నారు.

కోల్ ట్రాన్స్‌పోర్టర్‌కే కమిషనా..?

సత్తుపల్లి జేవీఆర్, కిష్టారం ఓసీలకు కోల్ ట్రాన్స్‌పోర్టర్లుగా వ్యవహరించే వ్యక్తులు కమీషన్లు తీసుకుంటున్నారనే వస్తున్న ఆరోపణలపై లారీ యజమానుల్లో భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కోల్ ట్రాన్స్‌పోర్టర్ లోడింగ్‌లకే పరిమితమవుతారని, కిరాయి ఎంత, కమీషన్ ఎంత వంటి విషయాలు పట్టించుకోరని, కోల్ ఏజెంట్‌లే ఈ వ్యవహారం అంతా నడుపుతుంటారనే వాదనలు వినిపిస్తున్నాయి. సత్తుపల్లి లారీ యూనియన్ కార్యాలయంలో ఆరుగురు కోల్ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారని.. మానవతా దృక్పథంతో లోడింగ్‌లపై తగు నిర్ణయం తీసుకోవాలని లారీ యూనియన్ మాజీ అధ్యక్షుడు పీ.ఎల్.ప్రసాద్ లారీ యజమానుల గ్రూప్‌ల్లో పోస్టు చేయడం చర్చనీయాంశమైంది. బయట లారీలకు ఇచ్చే నాలుగు కిరాయిలను కూడా స్థానిక లారీలకు బొగ్గు లారీలకు అవకాశం కల్పించాలని కోరారు.

సరికొత్త ఎత్తుగడలు..

కమీషన్లపై బహిరంగంగా మాట్లాడుతున్న లారీ యజమానులకు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. లోకల్‌కు ఏడు, నాన్‌లోకల్‌కు 4 శాతం చొప్పున లోడింగ్‌లకు అడ్డు చెపితే.. కోల్ పర్మిట్లు రాకుండా అడ్డుకుంటామంటూ ఏజెంట్లు నయానా.. బయనా లొంగదీసుకునేందుకు సరికొత్త ఎత్తుగడలకు దిగుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. నాన్‌లోకల్‌కు అనుమతి ఇవ్వకపోతే అసలు లోడింగే ఇవ్వకుండా చూస్తామంటూ కొందరు ఏజెంట్లు లారీ యజమానుల వద్ద ప్రస్తావిస్తున్నట్లు తెలిసింది.

మళ్లీ దొంగలు పడ్డారు..

- సింగరేణి క్వార్టర్లలో చోరీ
- తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్..
- విచారణ చేస్తున్న క్లూస్ టీం


చోరీ జరిగిన క్వార్టర్‌ను పరిశీలిస్తున్న సీఐ శ్రీహరి


అశోక్ ఇంట్లో చోరీ చేస్తున్న దొంగల సీసీ ఫుటేజ్

సత్తుపల్లి: సింగరేణి క్వార్టర్స్‌లో మళ్లీ దొంగలు పడ్డారు. ఈ ఏడాది ఏప్రిల్ 9న భారీ చోరీ సంఘటన మరవక ముందే.. శనివారం రాత్రి 2.30 గంటల సమయాన మళ్లీ చోరీ జరగడం సంచలనమైంది. రాఖీ పండగ, వరుస సెలవులు రావడంతో సింగరేణి కార్మికులు బంధువుల ఇళ్లకు వెళ్లారు. ఇక పోతే సింగరేణి క్వార్టర్స్‌లో తలుపులు బలహీనంగా.. అల్యూమినియం గడియలు ఉండడంతో దొంగలకు గడియలు పగలకొట్టడం తేలికైనట్టుగా ఉంది. తాళాలు వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్ చేసి మరీ చోరీకి పాల్పడ్డారు. అశోక్ ఇంట్లో రెండు తులాల బంగారం, 57 తులాల వెండి, రూ.20వేల నగదు, అఖిల్ ఇంట్లో 16 కాసుల బంగారం, ఎండీ సాధిక్ ఇంట్లో రూ.2 లక్షల నగదు, 40 గ్రాముల వెండి, కె.సుధాకర్ ఇంట్లో రూ.30వేల నగదు, నసీమ్‌ఖాన్ ఇంట్లో రూ.20వేల నగదు, శీలం రాజు ఇంట్లో రూ.16వేల నగదు చోరీకి గురయ్యాయి. ఏప్రిల్ నెలలో 8 క్వార్టర్స్‌లో జరిగిన చోరీ ఘటనలో రూ.80 లక్షలకుపైగా బంగారం, నగదు, వెండి వస్తువులు అపహరణకు గురయ్యాయి. ఇప్పటి వరకు దీనిపై ఎటువంటి క్లూ చిక్కలేదు. సింగరేణి కార్మికుల ఇళ్లనే టార్గెట్‌గా నాలుగేళ్లలో సుమారు పదికిపైగా చోరీ సంఘటనలు నమోదయ్యాయి.

సీసీ కెమెరా అలర్ట్‌తో..

సింగరేణి క్వార్టర్స్‌లో 26 బ్లాక్‌లలో కొందరు సొంత ఖర్చులతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నారు. 26, 6, 4, ఎంసీ, 19, 20 బ్లాక్‌లలో మొత్తం ఆరుగురు ఇళ్లల్లో చోరీ జరిగింది. సీసీ ఫుటేజీలను పరిశీలిస్తే దొంగలు నక్కినక్కి వెళ్తున్నట్లు రికార్డు అయింది. అశోక్ ఇంటి లోపల సీసీ కెమెరాలో ముగ్గురు దొంగలు ఇంట్లో దూరి ఎత్తుకెళ్తున్నట్లు కన్పిస్తోంది. అయితే బయట సీసీ కెమెరా మనుషుల కదలికలను పసిగట్టి 'అలర్ట్'సైరన్ ఇచ్చింది. జేవీఆర్ ఓసీలో పని చేస్తున్న ఏపీ ఆపరేటర్ రషీద్‌పాషా సీసీ కెమెరాలకు లింక్ చేసి ఉండటం.. అదే సమయంలో అతను విధుల్లో ఉండటంతో ఒక్కసారిగా సీసీ కెమెరాలను పరిశీలించి తోటి కార్మికులకు, పోలీసులకు ఫోన్‌లో సమాచారం అందించడంతో హుటాహుటీన పోలీసులు అక్కడికి చేరుకున్నారు. కార్మికులు అప్రమత్తం కావటంతో దొంగలు పరారయ్యారు.

క్లూస్ టీమ్ రంగ ప్రవేశం..

పోలీసులు శనివారం రాత్రి అంతా గస్తీని ముమ్మరం చేశారు. సత్తుపల్లి పట్టణ సీఐ తుమ్మలపల్లి శ్రీహరి సిబ్బందితో చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. క్వార్టర్స్ వెనుకవైపు నుంచి ముళ్ల కంచెను కట్ చేసి దొంగలు క్వార్టర్స్‌లోకి ప్రవేశించినట్లు గుర్తించారు. ఖమ్మం క్లూస్‌టీం ఆదివారం చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించి వేలిముద్రలను సేకరించారు.

దొంగలుపడిన నాలుగు నెలలకు..

దొంగలు పడిన ఆరు నెలలకు పోలీసులు వచ్చిన చందంగా సింగరేణి అధికారులు గత కొంతకాలంగా సింగరేణి కార్మికులు సెక్యూరిటీ ఏర్పాటు చేయమని పలు దఫాలుగా విజ్ఞప్తులు, విన్నపాలు చేస్తున్నారు. క్వార్టర్స్ వెనుక అటవీ ప్రాంతం ఉండడంతో ప్రహరీకి విద్యుత్ సరఫరా ఇవ్వాలని చెప్పినా పట్టించుకోకపోవటంపై కార్మికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కాగా, సింగరేణి అధికారులు ఆదివారం సెక్యూరిటీని పెడుతున్నట్లు సెక్యూరిటీ అవుట్‌పోస్టును పెట్టడం గమనార్హం.